# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

శుక్రవారం | 16 | అక్టోబర్ | 2026 పేజీలు: 9


# కలెక్టరేట్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

### ఘనంగా తెలంగాణ ఆడపడుచుల వేడుకలు





హైదరాబాద్, అక్టోబర్ 15(మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని, ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసే అపురూప వేడుక బతుకమ్మ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్లో సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ముఖ్య అతిథిగా విచ్చేశారు. కలెక్టరేట్ ప్రాంగణం అంతా రంగురంగుల పూల సువాసనలు, సంప్రదాయ పాటల హోరుతో పండుగ శోభను సంతరించుకుంది.

2



### పట్టణ ఆరోగ్య కేంద్రాలకు

# ఆధునిక వైద్య పరికరాలు



### నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం: కిషన్ రెడ్డి..

### కవాడిగూడ, ముషీరాబాద్, మెట్టుగూడ యూపీహెచ్సి లలో సౌకర్యాల పరిశీలన..

*సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యుపిహెచ్సి) అభివృద్ధికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.*

3

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలి: తలసాని



### శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

### మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, కట్ట మైసమ్మ ఆలయాల్లో పూజలు..

సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు.

2



# కలెక్టరేట్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు





## ఘనంగా తెలంగాణ ఆడపడుచుల వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 15(మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని, ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసే అపురూప వేడుక బతుకమ్మ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్లో సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ముఖ్య అతిథిగా విచ్చేశారు. కలెక్టరేట్ ప్రాంగణం అంతా రంగురంగుల పూల సువాసనలు, సంప్రదాయ పాటల హోరుతో పండుగ శోభను సంతరించుకుంద

### అలరించిన బతుకమ్మలు..

ఈ వేడుకల్లో జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల ప్రకృతి సిద్ధమైన పూలతో ఎంతో కళాత్మకంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేసిన మహిళా ఉద్యోగులు బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లతో లయబద్ధంగా సాగిన గౌరమ్మ పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా స్వయంగా సంప్రదాయబద్ధంగా బతుకమ్మను కొలుస్తూ, అధికారులతో కలిసి పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు.

### మహిళా ఉద్యోగులకు కలెక్టర్ పండుగ కానుకలు..

వేడుకల ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లా ప్రజలకు, ఉద్యోగినులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ, కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులందరికీ ప్రత్యేకంగా చీరలను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ అభివర్ణించారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. డాక్టర్ నారాయణ, సి.పి.ఓ. డాక్టర్ సురేందర్, ఎ.ఓ. వెంకట్రామిరెడ్డి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, ల్యాండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లావణ్య, బి.సి. సంక్షేమ అధికారి జి. ఆశన్న, ఎస్.సి. సంక్షేమ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, డి.డబ్ల్యు.ఓ. ఇంచార్జ్ రాజేందర్, ఎఫ్.డి.ఓ. రజిని, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు అన్ని మండలాల తహశీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సి.డి.పి.ఓ.లు, సి.డబ్ల్యు.సి. సభ్యులు, అంగన్వాడీ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





















# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలి: తలసాని

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

## మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, కట్ట మైసమ్మ ఆలయాల్లో పూజలు..







సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. గురువారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రముఖ ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా రాంగోపాల్ పేట డివిజన్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని సందర్శించిన తలసాని శ్రీనివాస్ యాదవ్, మహంకాళి అమ్మవారిని, భవానీ మాత అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అమీర్ పేట డివిజన్లోని కుమ్మరి బస్తీ హనుమాన్ దేవాలయంలో బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని, కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆ తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ తల్లిని, గాయత్రీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేగంపేటలోని కట్ట మైసమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేసిన ఎమ్మెల్యే, శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో పండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు, ఆలయ చైర్మన్లు సాయిబాబా గౌడ్, సత్యనారాయణ యాదవ్, మల్లికార్జున్, సుభాష్, ఆయా డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్నినో నేపథ్యంలో నీటి సంరక్షణకు ఎంఎంసీ కార్యాచరణ

**నిర్మాణ పనులకు ఎస్టీపీ శుద్ధి జలాలు వినియోగించాలి..**

**పార్కులు, పచ్చదనం నిర్వహణలో తాగునీటి వినియోగం తగ్గించాలి: కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి..**




సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడంతో పాటు, శుద్ధి చేసిన మురుగునీటిని పునర్వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ మేరకు తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్బీ) అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గృహాలు, వాణిజ్య సముదాయాలు, నిర్మాణ ప్రాంతాలు, పార్కుల్లో నీటి వృథాను అరికట్టేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నిర్మాణ పనులకు తాగునీటిని వినియోగించడాన్ని తగ్గించి, సాధ్యమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి లభించే శుద్ధి జలాలను ఉపయోగించేలా నిర్మాణ సంస్థలను ప్రోత్సహించాలని సూచించారు.

**పచ్చదనం పరిరక్షణకు ప్రత్యామ్నాయ నీటి వనరులు**

పార్కులు, గ్రీన్బెల్టులు, ఇతర పచ్చదనం ఉన్న ప్రాంతాల్లో మొక్కల సంరక్షణకు ఎస్టీపీ శుద్ధి జలాలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. దీనివల్ల తాగునీటిపై ఒత్తిడి తగ్గడంతో పాటు పచ్చదనాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు.

**ప్రజల భాగస్వామ్యంతో నీటి పొదుపు**

నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఎంఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు అమలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్బీ ఈడీ పంకజ, చీఫ్ ఇంజినీర్ బి.ఎల్. శ్రీనివాసరావు, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, యూబీడీ డైరెక్టర్ సునంద, పీడీ యూసీడీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ఆధునిక వైద్య పరికరాలు



**నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం: కిషన్ రెడ్డి..**

**కవాడిగూడ, ముషీరాబాద్, మెట్టుగూడ యూపీహెచ్సి లలో సౌకర్యాల పరిశీలన..**

సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యుపిహెచ్సి) అభివృద్ధికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా గురువారం కవాడిగూడలోని డీబీఆర్ మిల్స్, ముషీరాబాద్ మెయిన్ రోడ్డులోని యుపిహెచ్సి లతో పాటు మెట్టుగూడలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు అందుబాటులో ఉన్న ఉచిత మందులు, వైద్య సదుపాయాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాల అందజేత**

ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు వేగవంతమైన, మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను కిషన్ రెడ్డి అందజేశారు. ఇందులో ఈసీజీ మెషీన్ తో కూడిన రెక్లైనర్ బెడ్, రక్త నమూనాల సేకరణకు ఫ్లెబోటమీ కుర్చీలు, నెబ్యులైజర్లు, డిజిటల్ బీపీ పరికరాలు, గ్లూకోమీటర్లు, డిజిటల్ బరువు కొలిచే యంత్రాలు ఉన్నాయి. వీటితో పాటు ఎల్ఈడీ డిస్ప్లే బోర్డులు, రోగుల గోప్యత కోసం స్క్రీన్లు, నీడిల్ హబ్ కట్టర్లు, స్టీల్ వెయిటింగ్ కుర్చీలు, మంచినీటి డిస్పెన్సర్లను కూడా సమకూర్చారు. ఈ పరికరాల ద్వారా శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి చికిత్సతో పాటు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిల పరీక్షలు మరింత సులభతరం కానున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.




# అన్నోజిగూడ వరకు ఎలివేటెడ్ కారిడార్ను పొడిగించాలి!



**రాచకొండ పోలీస్ కమిషనరేట్కు ప్రత్యేక అండర్పాస్ ఏర్పాటు చేయాలి**

**పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపాలి**

**పరిసర కాలనీలు, గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలి**

**ఎన్హెచ్ఏఐ అధికారులకు బీజేపీ నేత ఏనుగు సుదర్శన్ రెడ్డి వినతి**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 15: ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ను అన్నోజిగూడ ఎన్హెచ్ఏఐ టోల్రోడ్డు ప్రవేశం వరకు పొడిగించాలని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రహదారి సౌకర్యాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర యువమోర్చా నాయకుడు బండారు పవన్ రెడ్డితో కలిసి ఎన్హెచ్ఏఐ చీఫ్ ఇంజినీర్, రీజినల్ ఆఫీసర్ ఎ.కృష్ణ ప్రసాద్కు వినతిపత్రం అందజేశారు.

**భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు**

సాయి ఐశ్వర్య కాలనీ, పర్వతాపురం, ప్రతాపసింగారం, కాచవానిసింగారం ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. కొత్త నివాస సముదాయాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలు మరింత అధికమయ్యే అవకాశముందన్నారు. ముఖ్యంగా నూతన రాచకొండ పోలీస్ కమిషనరేట్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ రద్దీ పెరిగే పరిస్థితి ఉందని వివరించారు.

**పోలీస్ కమిషనరేట్కు ప్రత్యేక అనుసంధానం**

రాచకొండ పోలీస్ కమిషనరేట్కు వెళ్లే అధికారులు, సిబ్బంది, ప్రజలతో పాటు అత్యవసర సేవల వాహనాలకు ఇబ్బందులు లేకుండా లిమిటెడ్ వెహికల్ అండర్పాస్ (ఎల్వీయూపీ) లేదా ప్రత్యేక అనుసంధాన మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ను అన్నోజిగూడ వరకు పొడిగిస్తే ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు పరిసర గ్రామాలకు జాతీయ రహదారితో మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని తెలిపారు.

**సాంకేతిక అధ్యయనం చేపట్టాలి**

ప్రతిపాదిత కారిడార్ పొడిగింపు, అండర్పాస్ నిర్మాణంపై సమగ్ర ట్రాఫిక్ అంచనా, సాంకేతిక సాధ్యాసాధ్యాల అధ్యయనం నిర్వహించాలని సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుత దశలోనే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడితే భవిష్యత్తులో భారీ వ్యయంతో మార్పులు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజల ప్రయాణ సౌకర్యం, రహదారి భద్రత, ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎన్హెచ్ఏఐ అధికారులను కోరారు.



# నేడు 2బి బార్ల లాటరీ ద్వారా ఎంపిక

**దరఖాస్తుదారులు హాజరుకావాలని ఎక్సైజ్ శాఖ అధికారుల విజ్ఞప్తి**

మేడ్చల్, అక్టోబర్ 15: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అలియాబాద్-1, మూడుచింతలపల్లి-2, ఎల్లంపేట-2 బార్లకు ఈనెల 16న ఉదయం 9 గంటలకు లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, షామీర్పేట మండలం, అంతాయిపల్లి గ్రామంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ( ఐ డి ఓ సి )లో 2బి బార్లను లాటరీ విధానం ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ బార్లకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులందరూ నిర్ణీత తేదీ, సమయానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ తెలిపారు.



# ఖానాపూర్‌లో కులాల మధ్య ఐక్యత చెడగొట్టవద్దు

**ఖానాపూర్ గ్రామంలో జరుగుతున్న సంఘటనలతో మాకు సంబంధం లేదు..**

**రాజకీయ స్వార్థం కోసం ఎస్సీ కులస్థులను వాడుకోవద్దు..**

చేవెళ్ల ,అక్టోబర్ 15(మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మండలం ఖానాపూర్ గ్రామంలో ఇటీవల జరుగుతున్న సంఘటనలతో తమకు ఎలాంటి సంబంధం లేదని గ్రామానికి చెందిన ఎస్సీ కులస్థులు స్పష్టం చేశారు. గ్రామంలో అన్ని కులాల వారు ఐకమత్యంతో కలిసి మెలిసి జీవిస్తున్నారని తెలిపారు. అయితే కొంతమంది రాజకీయ స్వార్థం కోసం ఎస్సీ కులస్థులను ఉపయోగించుకుంటూ అల్లర్లకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. గ్రామంలో కులవివక్షను ప్రోత్సహించే విధం గా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన ప్రకటనల్లో తమ ప్రాంతాన్ని ఎస్సీ కాలనీగా పేర్కొంటూ, కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆ పేరును ఉపయోగించి అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామంలో అన్ని కులాల మధ్య ఐక్యత, సోదరభావం కొనసాగాలని, రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు సృష్టించవద్దని వారు కోరారు. ఖానాపూర్ గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళా రైతులే గ్రామీణ ప్రగతికి మూలస్తంభాలు!

**బోడంపాడులో అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం**

**మహిళా రైతులకు సర్పంచ్ కమలమ్మ సన్మానం**

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి: వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర**



షాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్): షాబాద్ మండలం బోడంపాడు గ్రామంలో గురువారం అంతర్జాతీయ మహిళా రైతుల దినోత్సవాన్ని గ్రామ సర్పంచ్ సబ్బరిగారి కమలమ్మ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కమలమ్మ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళా రైతుల పాత్ర ఎంతో కీలకమని, వారి కృషిని గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆహార భద్రత సాధనలో మహిళా రైతుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు.

మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర మాట్లాడుతూ మహిళా రైతులు ఆధునిక, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకొని పంటల దిగుబడిని పెంచుకోవాలని సూచించారు.

స్థిరమైన వ్యవసాయ విధానాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఈవో మౌనిక, పంచాయతీ కార్యదర్శి స్నేహలత, ఉపసర్పంచ్ కళ్ళెం శ్రీనివాస్, సుబ్బరిగారి చెన్నయ్య, కళ్ళెం ఆనంద్, కాకునూరి అశోక్, రాజు, గోళ్ళ నర్సింహులు, రఘుపతిరెడ్డి, వెంకటయ్యతో పాటు మహిళా రైతులు రాధిక, కోట లక్ష్మి, కారు సువర్ణ, కళ్ళెం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల ప్రగతికి ఎంపీ ప్రత్యేక చొరవ

**చేవెళ్ల అభివృద్ధికి రూ.5.90 కోట్ల నిధులు: పలు పనులకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి శ్రీకారం**

చేవెళ్ల, అక్టోబర్ 15(మనం న్యూస్): చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఎంపీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పల్గుట్టలో రూ.10 లక్షలు, మల్కాపురంలో రూ.10 లక్షలు, ధర్మసాగరంలో రూ.5 లక్షలు, దేవుని ఎర్రవల్లిలో రూ.18 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం మొత్తం రూ.5.90 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులు కేటాయించగా, ఇందులో చేవెళ్ల మున్సిపాలిటీ, మండల పరిధిలోని అభివృద్ధి పనుల కోసం రూ.1.92 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా.....ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ......ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు.







ఈ కార్యక్రమాల్లో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు మీనాక్షి సత్యనారాయణ,మనీషా రెడ్డి, మాధవి యాదవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు అనంత్ రెడ్డి, సామ మాణిక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వైభవ్ రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పత్తి సత్యనారాయణ, రాజు తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు...



# మైనర్ బాలికల లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

**రూ.1,000 జరిమానా విధించిన మేడ్చల్ ఫాస్ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం**

మేడ్చల్, అక్టోబర్ 15: ( మనం జిల్లా ప్రతినిధి ): మైనర్ బాలికలను వెంటాడుతూ, అసభ్యకర వీడియోలు చూపించి లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి మేడ్చల్ ఫాస్ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతోపాటు రూ.1,000 జరిమానా చెల్లించాలని గురువారం తీర్పు వెలువరించింది.

వివరాల్లోకి వెళితే.. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్నగర్కు చెందిన దాకూరి దశరథ్ (49) ఇద్దరు మైనర్ బాలికలను వెంటాడుతూ, పురుషులు, మహిళలకు సంబంధించిన నగ్న వీడియోలు చూపించి లైంగికంగా వేధించినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసును విచారించిన మేడ్చల్లోని అత్యాచార, పోక్సో కేసుల సత్వర విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్రాక్ న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ పోక్సో చట్టంలోని సెక్షన్ 11(జీజీజీ), సెక్షన్ 12 కింద రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది.

ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్గా ప్రభాకర్ రెడ్డి వాదనలు వినిపించారు.

# సక్సెషన్‌కు రూ.5 లక్షల లంచం డిమాండ్!

**రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన ముగ్గురు రెవెన్యూ అధికారులు**

**కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణపై ఏసీబీ చర్యలు.**



కీసర, అక్టోబర్ 15 (మనం న్యూస్): భూమి సక్సెషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, అందులో మొదటి విడతగా రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ముగ్గురు రెవెన్యూ అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ ఈ వ్యవహారంలో ఏసీబీకి చిక్కినట్లు తెలిసింది.

**మూడు ఎకరాల భూమి సక్సెషన్ కోసం..**

వివరాల్లోకి వెళితే.. కీసరకు చెందిన పన్నాల బుచ్చిరెడ్డి భార్య పన్నాల సుశీల ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె పేరు మీద ఉన్న సర్వే నంబర్లు 183, 184లోని మూడు ఎకరాల భూమిని సక్సెషన్ ద్వారా తన పేరుపైకి మార్చుకునేందుకు పన్నాల గిరిధర్ రెడ్డి సంబంధిత రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించారు.

అయితే, సదరు భూమి 22ఏ జాబితాలో ఉందని పేర్కొంటూ, సక్సెషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలంటే తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలయంలోనూ డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బాధితుడికి చెప్పినట్లు సమాచారం.

**నగదు చేతులు మారుతుండగా ఏసీబీ దాడి..**

ఈ నేపథ్యంలో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఏసీబీ పథకంలో భాగంగా మొదటగా రూ.2.50 లక్షలను కీసర తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డికి అందజేసినట్లు సమాచారం. అనంతరం ఆయన ఆ నగదును రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణకు అప్పగించగా, బాలకృష్ణ ఆ డబ్బును డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి గదిలోకి తీసుకెళ్లి ఆయన బ్యాగులో పెడుతున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిసింది.



ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సేవల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. భూముల సక్సెషన్, రికార్డుల మార్పిడి వంటి కీలకమైన రెవెన్యూ సేవల విషయంలో ఇలాంటి ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.



## ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి మిరియాల ప్రీతమ్, మిరియాల రాఘవరావు జన్మదిన శుభాకాంక్షలు

మనం న్యూస్ // మియాపూర్, సెప్టెంబర్ 15: ప్రజలతో ఆత్మీయ అనుబంధాన్ని కలిగి, చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజాసేవలో ముందుండే ప్రజానాయకుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జన్మదినం సందర్భంగా మిరియాల ప్రీతమ్ , మిరియాల రాఘవరావు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే అరెకె పూడి గాంధీ నివాసానికి వెళ్లి, గజమాలతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు మరింత సేవలందిస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం ప్రజాజీవితంలో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో విష్ణుమూర్తి, జగన్నాథరావు, చలం, కృష్ణ, త్రినాథ్, ప్రసాద్, పరదేశి నాయుడు, శ్యామల రావు, వెంకట్రావు, విష్ణు, సాయి, త్రిలోచన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



మేడ్చల్, అక్టోబర్ 15: ( మనం జిల్లా ప్రతినిధి ): ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ , వైస్ చైర్పర్సన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొనున్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, మహిళల ఐక్యతను చాటే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మున్సిపల్ అధికారులు కోరారు.





## మహిళా రైతులకు ఘనంగా సన్మానం

మేడ్చల్, అక్టోబర్ 15: ( మనం జిల్లా ప్రతినిధి): మహిళా రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని షామీర్పేట్లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మహిళా రైతులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో మహిళా రైతులు అందిస్తున్న సేవలను, వ్యవసాయ ఉత్పత్తి పెంపులో మరియు కుటుంబ ఆర్థికాభివృద్ధిలో వారు పోషిస్తున్న కీలక పాత్రను కొనియాడారు. పంటల సాగు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, పంటల సంరక్షణ తదితర వ్యవసాయ కార్యకలాపాల్లో మహిళా రైతుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, ప్రభుత్వ వ్యవసాయ శాఖ అందించే పథకాలు మరియు సాంకేతిక సూచనలను వినియోగించుకొని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళా రైతుల కృషిని గుర్తించి, వారిని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగంలో వారి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా రైతులు సరసం లక్ష్మీ , వంగేటి సమత, బాలమణి మరియు ఇతర మహిళా రైతులను సత్కరించి వ్యవసాయ రంగంలో వారి సేవలకు అభినందనలు తెలియజేశారు.

## హైతాబాద్ గ్రామానికి కొత్త వెలుగు

**విరజిమ్మనున్న హైమాస్ లైట్లు**

**రూ. 4 లక్షలతో రెండు హైమాస్ లైట్ల ప్రారంభం**

**గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్**

**రాత్రి వేళ వెలుతురు సమస్యకు శాశ్వత పరిష్కారం : సర్పంచ్ శాంతమ్మ**



షాబాద్,అక్టోబర్ 15 (మనం న్యూస్): షాబాద్ మండలం హైతాబాద్ గ్రామంలో రూ. 4 లక్షల ప్రభుత్వ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు హైమాస్ లైట్లను గ్రామ సర్పంచ్ కర్రోళ్ల శాంతమ్మ యాదయ్య గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ తో కలిసి స్విచ్ ఆన్ చేసి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామంలో హైమాస్ లైట్ల ఏర్పాటుతో రాత్రి వేళల్లో వెలుతురు సమస్య పూర్తిగా తీరుతుందని, గ్రామ ప్రజలకు, వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. హైతాబాద్ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కావలి రవి, బూడిగారి సత్తయ్య, మాజీ సర్పంచ్ ఎండీ ఖాజామియా పటేల్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, ఎండీ జహంగీర్, ఎండీ బూరన్, సత్తయ్య, పెద్ద జంగని రాఘవేందర్, కృష్ణ, నర్సింహా, శ్రీనివాస్, శాంతప్ప, ఎండీ గౌస్, చాకలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్లో ఈశా యోగా సెంటర్!

**300 ఎకరాల్లో భారీ ప్రాజెక్టు..**
**రూ.900 కోట్ల పెట్టుబడికి ఆమోదం**
**శరవేగంగా అభివృద్ధి చెందుతున్న షాబాద్**
**షాబాద్ మండలంలో భూములకు రెక్కలు**
**రేగడి దోస్వాడ, తాళ్లపల్లి గ్రామాల పరిధిలో భూముల కేటాయింపు**
**తమిళనాడు తరహాలో ఆదియోగి విగ్రహం ఏర్పాటు**
**రెండు దశల్లో ఆధ్యాత్మిక, విద్యా, వెల్నెస్ కేంద్రాల నిర్మాణం**
**వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా**
**అధికార ప్రకటన ద్వారా మరింత స్పష్టత రావాల్సి ఉంది**

షాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, విద్యా, పర్యాటక, ఆరోగ్య సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో భారీ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.900 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించగా, షాబాద్ మండల పరిధిలోని రేగడి దోస్వాడ, తాళ్లపల్లి గ్రామాల పరిసరాల్లో భూమిల కేటాయింపు జరిగినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే షాబాద్ ప్రాంతానికి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా కొత్త గుర్తింపు లభించడంతోపాటు స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరిగే అవకాశముంది.

### తమిళనాడు తరహాలో ఆదియోగి విగ్రహం

కోయంబత్తూరులోని ఈశా యోగా కేంద్రంలో ఉన్న ఆదియోగి విగ్రహాన్ని పోలిన భారీ విగ్రహాన్ని షాబాద్ పరిధిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఆధ్యాత్మికత, యోగా, విద్య, ప్రకృతి ఆధారిత జీవన విధానాలను సమన్వయం చేస్తూ ఈ ప్రాంగణాన్ని తీర్చిదిద్దనున్నారు. ఈ క్యాంపస్కు 'అబోడ్ ఆఫ్ యోగా, ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ ఇంటర్నేషనల్ యోగా సెంటర్' అనే పేరు ప్రతిపాదించినట్లు కథనాల్లో పేర్కొన్నారు.

### రెండు దశల్లో ప్రాజెక్టు అభివృద్ధి

ఈ భారీ ప్రాజెక్టును రెండు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు సమాచారం. మొదటి దశలో రూ.590 కోట్లకు పైగా వ్యయంతో ఆధ్యాత్మిక మౌలిక సదుపాయాలు, ఆదియోగి విగ్రహం, స్వాగత-అనుభవ కేంద్రం, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాసంస్థలు, నివాస వసతులు, అగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్టులు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రెండో దశలో సుమారు రూ.160 కోట్లతో పాఠశాలలు, కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక హాళ్లు, సాంస్కృతిక-వెల్నెస్ కేంద్రాలు, ఫుడ్ కోర్టులు, సందర్శకుల కోసం అదనపు వసతి సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ప్రాజెక్టు ప్రారంభమైన నాలుగేళ్ల అనంతరం నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధికి గ్లోబల్ లీడర్షిప్ అకాడమీని ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం.



### వేలాది మందికి ఉపాధి అవకాశాలు

ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 14 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. యోగా శిక్షకులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పర్యాటక మార్గదర్శకులు, హోటల్ నిర్వహణ సిబ్బంది, భద్రతా సిబ్బంది, ఇతర పరిపాలనా విభాగాల్లో ఉద్యోగాలు ఏర్పడే అవకాశముంది. పరిసర గ్రామాల యువతకు ఉపాధి కల్పించడంతోపాటు స్థానిక రైతులు, చేతివృత్తుల వారికి కూడా వ్యాపార అవకాశాలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### పర్యాటక రంగానికి కొత్త ఊపు

దేశ, విదేశాల నుంచి సందర్శకులు వచ్చే అవకాశముండటంతో షాబాద్ పరిసరాల్లో హోటళ్లు, రిసార్టులు, హోమ్స్టేలు, రవాణా సేవలు విస్తరించే అవకాశం ఉంది. సందర్శకుల అవసరాలకు అనుగుణంగా స్థానికంగా కూరగాయలు, పాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరగవచ్చని అంచనా. పూజా సామగ్రి, సంప్రదాయ హస్తకళల విక్రయాల ద్వారా స్థానిక వ్యాపారులకు ప్రయోజనం చేకూరే అవకాశముంది.

### భూముల ధరలు, మౌలిక సదుపాయాలపై ప్రభావం

ఇప్పటికే పారిశ్రామిక కార్యకలాపాలతో అభివృద్ధి చెందుతున్న షాబాద్ ప్రాంతానికి ఈ ప్రాజెక్టు మరింత ప్రాధాన్యం తీసుకురావచ్చని భావిస్తున్నారు. షాబాద్, చేవెళ్ల, శంకర్పల్లి, మొయినాబాద్ ప్రాంతాలకు అనుసంధానమైన మార్గాల్లో వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. రవాణా, వసతి, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఊతం లభించవచ్చు. అయితే భూముల ధరలు, సందర్శకుల సంఖ్య, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంచనాలు ప్రాజెక్టు అమలు పురోగతిపై ఆధారపడి ఉంటాయి.

షాబాద్ అభివృద్ధికి కీలక మలుపు?₹ ఈశా ఫౌండేషన్ ప్రతిపాదిత ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే షాబాద్ మండలానికి రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పెరిగే అవకాశముంది. ఆధ్యాత్మిక పర్యాటకం, విద్య, ఆరోగ్య సంరక్షణ, స్థానిక ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడవచ్చని భావిస్తున్నారు. అయితే భూముల కేటాయింపు, పెట్టుబడి, నిర్మాణ అనుమతులు, పనుల ప్రారంభం వంటి అంశాలపై సంబంధిత అధికారిక ప్రకటనల ద్వారా మరింత స్పష్టత రావాల్సి ఉంది.

---

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్లో బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక**
**ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక**
**బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక.**



మేడ్చల్, అక్టోబర్ 15: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా యంత్రాంగం తరపున శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, డిఆర్డిఏ, జిల్లా అగ్రికల్చర్, జిల్లా హార్టికల్చర్, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ సతీమణి రాధా, డిప్యూటీ కలెక్టర్లు మోక్షిత, జరీరా ఫరీద్, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి రుబీనారాణి, జిల్లా ఎస్టీ సంక్షమ శాఖాధికారి పద్మజా, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రకళ, ఎస్టిఓ అలివేలుమంగ, ఎంతో ఉత్సాహంగా బతుకమ్మలు ఆడారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, కలెక్టరేట్ మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథులు పాడిన పాటలు అందరిని ఆకర్షించాయి.



## బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా సుంకు నవీన్ ముదిరాజ్



మేడ్చల్, అక్టోబర్ 15: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ రూరల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని బీజేవైఎం (భారతీయ జనతా యువమోర్చా) మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధి సుంకు నవీన్ కుమార్ ముదిరాజ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని సుంకు నవీన్ ముదిరాజ్ వెల్లడించారు.

# బల్కంపేట ఉజ్జయిని మహంకాళి ఆలయ అభివృద్ధికి ఆటంకాలెందుకు?

**దాతల సహకారంతో అభివృద్ధి పనులు..**
**గేటు నిర్మాణానికి అడ్డంకులు..**
**ఆలయ పవిత్రతను కాపాడేందుకు సహకరించాలి..**
**ఎమ్మెల్యే తలసాని చొరవ చూపాలని కమిటీ, భక్తుల విజ్ఞప్తి..**






సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) సనత్ నగర్ నియోజకవర్గం బల్కంపేటలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరిస్తుండగా, కొందరు వ్యక్తులు నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగించడం సరికాదని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఆలయానికి గేటు నిర్మించేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డంకులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించి అభివృద్ధి పనులు సజావుగా సాగేలా చూడాలని కోరుతున్నారు.

**దాతల సహకారంతో అమ్మవారికి విలువైన కానుకలు..**

మహిమాన్వితమైన శక్తిస్వరూపిణిగా భక్తులచే పూజలందుకుంటున్న అమ్మవారికి కాళీ ఉపాసకులైన పలువురు దాతలు వెండి మకర తోరణం, త్రిశూలం, పంచలోహ కిరీటం, బంగారు ముక్కుపుడకలు, ఇత్తడి చేతులు వంటి విలువైన వస్తువులను సమర్పించారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి అవకాశాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో, నిర్మాణ పనులకు ఆటంకాలు ఎదురవడంపై కమిటీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా చర్యలు చేపట్టాలి..**

మంగళ, ఆదివారాల్లో సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి వచ్చే కొందరు భక్తులు, ప్రహరీ లేకపోవడంతో మహంకాళి ఆలయ పరిసరాల్లోకి ప్రవేశించి వంటలు చేసుకోవడం, భోజనాలు చేయడం, మద్యం సేవించి సీసాలను పగులగొట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని కమిటీ ప్రతినిధులు చెబుతున్నారు. మలమూత్ర విసర్జనలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ఆలయ పవిత్రతకు భంగం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా గేటు నిర్మాణం చేపడుతుండగా, కొందరు అడ్డంకులు సృష్టించడం తగదని పేర్కొంటున్నారు.

**ఆలయ అభివృద్ధికి తలసాని చొరవ అవసరం..**

ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవ తీసుకుని ఆలయ అభివృద్ధి పనులకు ఎదురవుతున్న ఆటంకాలను తొలగించేలా చొరవ చూపాలని ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, భక్తులు కోరుతున్నారు. ఆలయ పవిత్రతను కాపాడటంతోపాటు భక్తులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు గేటు నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానికులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు.




## సైనిక్పురిలో అన్నదాన కార్యక్రమం వద్ద అపవిత్ర పదార్థాలు కలిపినట్లు ఆరోపణలు..

**మహిళకు 14 రోజుల రిమాండ్**
**నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**

సైనిక్పురి, అక్టోబర్ 15 (మనం న్యూస్ ):దేవి నవరాత్రుల సందర్భంగా ఆర్కే పురంలోని శ్రీ పోచమ్మ మైసమ్మ జయదుర్గ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో అపవిత్ర పదార్థాలు కలిపినట్లు వచ్చిన ఫిర్యాదుపై నేరేడ్మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి నిందితురాలిగా పేర్కొన్న నూర్జహాన్ షేక్ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 14, 2026న మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతంలో నివసించే నూర్జహాన్ షేక్ (39), ఆమె తల్లి బియాబీబీ కలిసి అన్నదాన కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన తాగునీటిలో చేపల పొట్టు, చేపలు కడిగిన నీటిని ఉద్దేశపూర్వకంగా కలిపినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఈ ఘటనపై ఆర్కే పురానికి చెందిన రమేష్ యాదవ్ ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పోలీసులు క్రైమ్ నంబర్ 876/2026తో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 196(2), 299, 351(2), 352 కింద కేసు నమోదు చేశారు.

విచారణలో భాగంగా రెండు మతాల మధ్య మతకలహాలు సృష్టించే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై నూర్జహాన్ షేక్ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, ఆమెను చంచల్గూడ జైలుకు తరలించినట్లు ప్రెస్ నోట్లో పేర్కొన్నారు.

## దసరా ప్రత్యేక బస్సుల నిర్వహణలో టీజీఎస్ఆర్టీసీ విజయవంతం

**6 రోజుల్లో 2,474 ప్రత్యేక బస్సుల ఆపరేషన్..**
**ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ నెల 16, 17 తేదీల్లో అదనపు సర్వీసులు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) చేపట్టిన ప్రత్యేక బస్సుల నిర్వహణ విజయవంతంగా కొనసాగుతోందని సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి తెలిపారు. అక్టోబర్ 9 నుంచి 14 వరకు ఆరు రోజుల వ్యవధిలో 2,630 బస్సులను సిద్ధం చేయగా, 2,474 బస్సులను నడిపి 94.07 శాతం ఆపరేషన్ సాధించినట్లు వెల్లడించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ప్రాంతీయ మేనేజర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రతిరోజూ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

అక్టోబర్ 10న అమావాస్య సందర్భంగా ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో ముందుగా కేటాయించిన 529 బస్సులకు బదులుగా 689 బస్సులను నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్లు తెలిపారు. జోన్ల వారీగా పరిశీలిస్తే, కరీంనగర్ జోన్ లో 1,770 బస్సుల లక్ష్యానికి 1,565 బస్సులను నడిపి 88.42 శాతం ఆపరేషన్ నమోదు చేయగా, హైదరాబాద్ జోన్ లో 860 బస్సుల లక్ష్యానికి 682 బస్సులను నడిపి 79.30 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. రీజియన్ల వారీగా ఖమ్మం 133.33 శాతం, మెదక్ 123.15 శాతం, ఆదిలాబాద్ 116.90 శాతం ఆపరేషన్లో మెరుగైన ఫలితాలు సాధించాయి. కరీంనగర్ రీజియన్ 94.76 శాతం, నల్గొండ 79.70 శాతం, మహబూబ్నగర్ 70.17 శాతం, వరంగల్ 66.73 శాతం, నిజామాబాద్ 62.69 శాతం, రంగారెడ్డి 37.74 శాతం ఆపరేషన్ నమోదు చేశాయి. గ్రేటర్ హైదరాబాద్లో పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా 227 బస్సులను అందుబాటులోకి తెచ్చి ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించినట్లు ఎండీ వివరించారు.

ఈ నెల 16, 17 తేదీల్లోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశమున్నందున అవసరమైన ప్రాంతాల్లో అదనపు బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. పండుగ ముగిసిన తర్వాత తిరిగి నగరాలకు చేరుకునే ప్రయాణికుల కోసం కూడా ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేయాలని సూచించారు. బస్ స్టేషన్లలో తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుద్ధ్యం, భద్రత విషయంలో తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రయాణికులు టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ల కోసం tgsrtcbus.in వెబ్సైట్ ను వినియోగించుకోవాలని నాగిరెడ్డి సూచించారు. ప్రత్యేక బస్సుల వివరాల కోసం 040-69440000, 040-23450033 నంబర్లలో ఆర్టీసీ కాల్ సెంటర్ ను సంప్రదించాలని కోరారు. ప్రయాణికులందరూ ఆర్టీసీ సేవలను వినియోగించుకుని సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# దివ్యాంగుల స్వావలంబనకు శ్వేత బెత్తం ప్రతీక





**వైట్ కేన్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం..**

**దృష్టిలోపం ఉన్నవారికి సమాన అవకాశాలు కల్పించాలి: ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి..**

సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) దృష్టిలోపం ఉన్న దివ్యాంగుల స్వతంత్ర ప్రయాణానికి, ఆత్మవిశ్వాసానికి శ్వేత బెత్తం కీలక సాధనమని ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో ఫ్రెండ్లీ ఎన్విరాన్ మెంట్ ఫర్ ది డిజే బుల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వైట్ కేన్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వరకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ, శ్వేత బెత్తం దృష్టిలోపం ఉన్నవారికి దారి చూపడమే కాకుండా, స్వతంత్రంగా జీవించేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం మాట్లాడుతూ రహదారులపై అడ్డంకులను గుర్తించి సురక్షితంగా ప్రయాణించేందుకు శ్వేత బెత్తం దోహదపడుతుందని తెలిపారు. దివ్యాంగులకు విద్య, ఉపాధి, రవాణా, ప్రజా ప్రదేశాల్లో సమాన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. వైట్ కేన్ డే ను వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్వాహకులు కోరగా, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఆ దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో చెరుకు నాగభూషణం, ఎల్. గోపాల్ రావు, డాక్టర్ కె. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఎన్. అశోక్, మారవేణి చంద్రశేఖర్ యాదవ్ తదితరులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా కార్మిక బతుకమ్మ వేడుకలు

**ఎంపీడీఓ కార్యాలయంలో కార్మిక బతుకమ్మ సంబరాలు**



మేడ్చల్, అక్టోబర్ 15: ( మనం జిల్లా ప్రతినిధి ): ఎంపీడీఓ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. అశోక్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్క ృతికి, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. తెలంగాణ సాయుదా ఉద్యమంలో బతుకమ్మ కీలక పాత్ర పోషించిందని, ఆ పోరాట స్ఫూరితోని మహిళా కార్మికులు తమ సమస్యలపైన రాజీలేని పోరాటం చెయ్యాలని వివరించారు. కార్మికులు తమ నిత్య జీవితంలో అనేక కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికీ, కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని, కార్మికుల ఐక్యతే మన బలమని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, కార్మికులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు లింగస్వామి, మేడ్చల్ మండల కార్యదర్శి ఎంపీ .నరేష్, మండల నాయకులు నర్సింగ్ రావ్, వసంత, ప్రేమలత , భాగ్యమ్మ, సునీత, చెంది ప్రవీణ్, పద్మ, రజిని, మహిళలు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మకు ఘనంగా హారతి

**లోక కళ్యాణం కోసం ప్రత్యేక పూజలు : మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి**



షాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్ ): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా షాబాద్ మండలం కుమ్మరిగూడ గ్రామంలో మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. సింహ వాహనంపై కొలువైన దుర్గమ్మ విగ్రహం వద్ద హారతి తీసుకొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక కళ్యాణం కోసం ప్రతి ఏటా దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. అమ్మవారి కృపతో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరగూడ సర్పంచ్ శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్,జంగయ్య, శ్రీశైలం,నారాయణ, రవి, నర్సింలు, దుర్గామాత, కమిటీ అధ్యక్షులు తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# షూటాఫ్లో చోళ చీఫ్స్ సంచలన విజయం

హైదరాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్లో చోళ చీఫ్స్ జట్టు పృథ్వీరాజ్ యోధాస్పై సంచలన విజయం సాధించింది. నెక్లెస్ రోడ్లోని పీపుల్స్ ప్లాజాలో గురువారం జరిగిన మ్యాచ్లో నాలుగు సెట్లు ముగిసేసరికి 4-4తో స్కోరు సమం కాగా, హిట్-ఆర్-మిస్ షూటాఫ్లో చోళ చీఫ్స్ 2-0తో గెలిచింది. అలెక్సాండ్రా ఉస్కియానో(కొలంబియా), యుక్త శ్రీ(భారత్) షూటాఫ్లో సత్తాచాటారు. ఉస్కియానో 80కి 80 పాయింట్లు సాధించింది. వరుసగా ఐదు ఓటముల తర్వాత గెలిచిన చోళ చీఫ్స్ నాలుగు పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలు నిలుపుకోగా, పృథ్వీరాజ్ యోధాస్ ఆరు పాయింట్లతో కొనసాగుతోంది. అక్టోబర్ 17న ఎలిమినేటర్-1, అక్టోబర్ 18న ఫైనల్ జరగనున్నాయి.



# సికింద్రాబాద్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళల కోలాహలం..**

**కార్యకర్తలతో కలిసి బతుకమ్మ ఆడిన పద్మారావు గౌడ్..**

సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు సికింద్రాబాద్లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. సీతాఫల్ మండీలోని సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. నియోజకవర్గంలోని వివిధ మున్సిపల్ డివిజన్ల నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ మహిళా నాయకులు, స్థానిక మహిళలతో కలిసి ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పద్మారావు గౌడ్ సైతం వారితో కలిసి బతుకమ్మ ఆడుతూ మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ తో పాటు పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.



# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**చేవెళ్లలో విక్రయానికి యత్నిస్తుండగా పట్టుకున్న పోలీసుల.. 670 గ్రాముల గంజాయి స్వాధీనం..**



చేవెళ్ల, అక్టోబర్ 15(మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని చేవెళ్ల పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 670 గ్రాముల గంజాయితో పాటు మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు.. చేవెళ్ల లేబర్ అడ్డా వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.

పోలీసుల విచారణ ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్ కుమార్ (25), తండ్రి విజయ్ కుమార్, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం ముట్పూర్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. హైదరాబాద్లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న అతను, అదనపు డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్వగ్రామానికి చెందిన కామేశ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్కు తీసుకువచ్చినట్లు విచారణలో వెల్లడైంది.

అనంతరం షాద్నగర్, కొందుర్గ్ ప్రాంతాల్లోని కార్మికుల అడ్డాల వద్ద ఒక్కో ప్యాకెట్ను రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మిగిలిన గంజాయి ప్యాకెట్లను విక్రయించేందుకు చేవెళ్ల లేబర్ అడ్డా వద్దకు వచ్చిన సమయంలో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



మేడ్చల్, అక్టోబర్ 15: ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని శ్రీరంగ వరంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. బి లక్ష్మి, షాహిదా బేగం కు చెరో లక్ష 16 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగవరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడి భిక్షపతి అనిల్ కుమార్ దుబ్బ బాలేష్ నరహరి దాడి శంకరాచార్య, ఎండి ఆజాం నాగార్జున రెడ్డి, కృష్ణ, ఎండి ఆసిఫ్, తలారి కృష్ణ, వి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి పథకం పేదలకు అండగా నిలుస్తుందని, పేదల జీవితాలలో వెలుగులు నింపేందుకే సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని వారు తెలిపారు.

# లాలాపేట్‌లో భక్తిశ్రద్ధలతో దుర్గామాత నవరాత్రి వేడుకలు

**అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు..**

**ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) లాలాపేట్ లోని లేబర్ అడ్డా సమీపంలో లాలాపేట్ మహారాణి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముధిరాజ్, కూరెల్లి నాగరాజ్ గౌడ్, మల్లికార్జున్, రాజలింగం దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపానికి చేరుకున్న నాయకులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు రుద్ర విక్రమ్, రుద్ర విశాల్ స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వేదమంత్రాల నడుమ ఆశీర్వచనం అందించి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్మాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి

**తార్నాక ఎక్స్ రోడ్లో బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన శిబిరం..**

**ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు నమోదు కీలకం: శ్రీరామ్ వెంకట్..**



సికింద్రాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్) అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని మహంకాళి జిల్లా బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటరు నమోదు కీలకమని ఆయన పేర్కొన్నారు. బీజేపీ తార్నాక డివిజన్ ఆధ్వర్యంలో గురువారం తార్నాక ఎక్స్ రోడ్స్ వద్ద ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హతలు, నమోదు విధానం, అవసరమైన పత్రాలపై పట్టభద్రులకు నాయకులు వివరించారు. ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవడంతోపాటు అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఓటరు నమోదు కేవలం ప్రక్రియ మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని చాటిచెప్పే బాధ్యత అని శ్రీరామ్ వెంకట్ అన్నారు. అర్హత ఉన్న పట్టభద్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెంపొందించి, పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే శిబిరం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల శారంగపాణి, హరి, డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్, మల్లేశ్వరి, అనూష, పవన్, కృష్ణ గౌడ్, ప్రకాష్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.